

# శిఖరం

పాపయారాధ్యులవారు సంధ్య పూర్తిచేసుకుని తలెత్తిచూస్తే ఒడ్డునున్న సత్తెయ్య ఆకాశం వైపు చూస్తూ కన్పించాడు. సత్తెయ్య చెట్ల కొమ్మలమీంచి పైపైకి పైపైకి దృష్టి సారించటం చిత్రంగా ఉంది పాపయారాధ్యులకి. ఒడ్డుకొచ్చి "ఒరేయ్ సత్తెయ్యా! నడుస్తున్న నేల చూసుకోక నల్లటి ఆకాశం

చూస్తున్నావేరా?'' అనడిగాడు. ఆ పలకరింపుకి సత్తెయ్య సిగ్గుపడిపోయి మనసులో ఉన్న మాట చెప్పేశాడు. "మా అయ్య ఇళ్ళూ, మిద్దెలూ కట్టి వెళ్ళిపోయాడయ్యా! నేను డాబాలు కట్టాను. మేడలు కట్టాను. చెట్టంత ఎత్తు. ఇంకా ఎత్తయిందీ, తల విరుచుకు చూస్తేగాని కన్పించనిదీ ఏదైనా కట్టాలనుందయ్యా?''అన్నాడు. పాపయారాధ్యులు నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

వేంకటాద్రినాయుడుగారు సభ తీర్చి మంతనాలు జరుపుతున్నారు. దేవాలయ నిర్మాణం పూర్తయింది. గాలిగోపురం కట్టడానికి పని వాళ్ళని తంజావూరునించి పిలిపిద్దామా, కటకం నించి రప్పిద్దామా అని. "ఈ గడ్డన పుట్టినవాడు, గడుసైనవాడు సత్తెయ్య ఉండగా, పరదేశికి కబురంపటమెందుకు ?'' అన్నారు పాపయారాధ్యులు. క్షణాలమీద కబురెళ్ళింది సత్తెయ్యకి.

చేతులు కట్టుకు నుంచున్న సత్తెయ్యని నాయుడు అడిగాడు "గాలిగోపురం కట్టగలవా?''

"తమ దయ అయితే.''

"తొమ్మిదంతస్తుల గోపురం?''

"తమ చిత్తం.''

తాంబూలమిచ్చి తక్షణమే పని ప్రారంభించమన్నాడు నాయుడు. సత్తెయ్య పొంగిపోయాడు. గుడికొచ్చి స్వామిముందు సాగిలపడి 'పిడికెడంత మనిషిని, బలహీనుణ్ణి. ఇంతటి కార్యం నిర్వహించగల శక్తి నువ్విvvవలసిందే, నువ్వు నడిపించవలసిందే తండ్రీ'' అని వేడుకున్నాడు.

ఇంటికొచ్చి భార్య శారదాంబకి చెప్పాడు "నేను పుట్టినందుకు ఫలితం దక్కేట్టుగా, ఈ గడ్డ రుణం తీర్చుకునేట్టుగా సామికి గోపురం కడ్తున్నానే.''

ఆ రోజునించి సత్తెయ్య అన్నం సరిగ్గా తినలేదు. నిద్ర సమంగా పోలేదు. అహోరాత్రాలు గోపురం ఆలోచనలే. పునాదిరాయి పడ్డప్పటినించి దాదాపు అక్కడే కాపురం. రాయి రాయినీ తాకేవాడు. బొమ్మ బొమ్మనీ నిమిరేవాడు. అంతస్తుపైన అంతస్తు పెరుగుతుంటే తృప్తిగా నవ్వుకునేవాడు.

సత్తెయ్య చిక్కిపోతుంటే శారదాంబ దిగులు పడ్డది. అసలే సన్నమనిషి. ఎముకలు బయట పడుతున్నాయి. కళ్ళు జ్యోతుల్లా వెలుగుతున్నాయి. ఆరోగ్యం చూసుకోండీ అంటే "ఈ శరీరమూ, కండలూ పెరిగితే ఏముందే! మనసు కాగిపోతుంటే ఎంత సుఖంగా ఉందీ!" అనేవాడు.

సత్తెయ్య నెత్తురు ధారపోశాడు. కండలు కరిగించి ఇచ్చాడు. నరాలు విరిగేట్టు శ్రమపడ్డాడు. ఏడంతస్తులు, ఎనిమిది, తొమ్మిదంతస్తులు పూర్తయ్యాయి. ఎత్తయిన గోపురం, నిటారు గోపురం, ఆకాశంలోకి చొచ్చుకుపోయిన గోపురం, చుక్కల్ని తాకే గోపురం ..... తన చేతులతో కట్టాడు. తను వూపిరిపోసి నిలిపాడు.

మర్నాడే శిఖర ప్రతిష్ట.

రాత్రి ఇంటికొచ్చి పడుకున్నాడేగాని, సత్తెయ్యకి నిద్ర పట్టలేదు. అర్ధరాత్రి ఉన్నట్టుండి లేచిపోయాడు. వెన్నెట్లో తొమ్మిదంతస్తుల గోపురం హిమవత్పర్వతంలా ఉంది. గబగబా ఒక అంతస్తు మీంచి మరో అంతస్తు పైకెక్కాడు. తొమ్మిదో అంతస్తు పైకొచ్చి అక్కడ నిటారుగా నుంచున్నాడు. తన కిందవున్న వూరుని చూశాడు. ఇళ్ళన్నీ బొమ్మరిళ్ళులా ఉన్నాయి. అంతంత పెద్దచెట్లు చిన్నవై మరీ చిన్నవై పూలమొక్కల్లా ఉన్నాయి. మంచాలమీద, అరుగులమీద నిద్రపోయే మనుషులు వేలెడంతే ఉన్నారు. నాయుడిగారి కోట, కాపలావాళ్ళు అంతా అడుగుమేరలో ఉన్న అల్పజీవుల్లా ఉన్నారు. సత్తెయ్య గుండె పెరిగింది. వొళ్ళు పెరిగింది. 'తనెంత గొప్పవాడు. ఎంత ఎత్తున

వున్నాడు! ఈ మనుషులు, ఈ వూరు, ఈలోకం ఎంత చిన్నవి. తన మేధస్సు ముందు, తనశక్తిముందు వీళ్ళంతా ఎంత? సత్తెయ్య గర్వంతో తొమ్మిదంతస్తుల గోపురం నుంచి పెద్దగా అరుద్దామనుకొన్నాడు. చుట్టూ కలయచూస్తూ వెనక్కు తిరిగాడు. వీపున ఎవరో ఛళ్ళున చరిచినట్లయింది. ఎదురుగా దేవాలయ శిఖరం! వెన్నెల్లో మెరుస్తోన్న శిఖరం! తొమ్మిదంతస్తుల గాలిగోపురం కంటె ఎత్తయిన శిఖరం !

సత్తెయ్యకి చమటలు పోశాయి. అహంకారం అణిగి పోయింది. చిన్నవాడై మరీ చిన్నవాడై నీరసంగా కిందకు దిగివచ్చాడు.

మర్నాడు కోలాహలంగా శిఖర ప్రతిష్ఠ జరుగుతోంది. సన్నాయిలు మోగుతున్నాయి. వేలాదిజనం అంతెత్తు గోపురాన్ని తలవిరుచుకు చూస్తున్నారు. "ఎంతెత్తు గోపురమో ఎంత గొప్ప గోపురఁవో" అని ఆశ్చర్యపోతున్నారు. సత్తెయ్య కూడా మామూలు మనిషయిపోయి, జనంలో ఒకడయిపోయి "ఎంతెత్తు గోపురవోఁ" అని తనూ అబ్బురపడ్డాడు. అది తాను కట్టిన గోపురం అనిపించలేదు. "అందులోని ఒక ఇటుకరాయి, ఓ మట్టిబెడ్డ విలువకూడా చేయడు." అనుకుంటూ శిఖరాలకి మొక్కాడు.

నాయుడు పెట్టిన కొత్త బట్టలు కట్టుకుని ఇంటికొచ్చి శారదాంబ వండిన పాయసం తింటున్నాడు సత్తెయ్య. అందరూ భర్త గురించి చెప్పుకుంటుంటే ఎంతో ఆనందపడ్డ ఆ ఇల్లాలు "ఏవయ్యా! గోపురం అంతా నువ్వే కట్టేవు గదా! నువ్వు కట్టినట్టుగా ఎక్కడో ఓ చోట నీ పేరు చెక్కకపోయావా!" అంది.

తింటున్న సత్తెయ్య ఆగి "ఓసి పిచ్చిదానా! గోపురం ఉన్నంత కాలం నేనుంటాను గదా! నాకింక పేరెందుకే! అసలు నాపేరే గోపురమే! ఎవరు కట్టారన్న పేరంటావా! అంతకంటె ఎత్తయిన దేవాలయ శిఖరం ఎవడు కట్టాడో వాడే" అన్నాడు.*